హైదరాబాద్ వార్త



## భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహించిన గవర్నర్ తమిళిసై



చార్మినార్,ఆగష్టు 25 ప్రభాతవార్త : శ్రావణ మాసంలోని శ్రీ వరలక్ష్మి వ్రతం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ శు క్రవారం చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని సందర్శించారు. గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌కు శ్రీ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భాగ్యలక్ష్మీ మందిరంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి ఆశీస్సులను తీసుకున్నారు. కాగా రాష్ట్ర గవర్నర్ చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో పూజలు నిర్వహించటానికి వచ్చిన సందర్భంగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. శ్రీ వరలక్ష్మీ వ్రతం సందర్భంగా జంట నగరాల లోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అమ్మ వారికి పూజలు జరపటానికి రావటంతో చార్మినార్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలి వచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ మం దిరం కమిటి ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## సిఎం సభకు ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సబితారెడ్డి



నార్సింగి, ఆగష్టు 25 ప్రభాతవార్త : గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలో ఉన్న ఫారెస్ట్ ట్రెక్ పార్కులో సీఎం కేసీఆర్ శనివారం హరితహా రంలో భాగంగా మొక్కలు నాటనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను రంగారెడ్డి జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ, మున్సిపల్ శాఖలకు చెందిన అధికారుల బృందంతో కలిసి సీఎం కేసీఆర్ మొక్కలు నాటే ప్రాంతాలు, తిరిగే ప్రాంతాలను మంత్రి పరిశీలిం చారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో అందంగా, అహ్లదంగా, సహజ సిద్ధంగా అభివృద్ధి చేసిన ఫారెస్ట్ ట్రెక్ పార్కును శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించబోతున్నారు. అలాగే ఈ పార్కులు ఔషద మొక్కలు, సాంప్రదాయ, పళ్లు, అంద మైన పూల మొక్కలు పెద్ద ఎత్తున నాటి అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మిక నేతలు

తార్నాక, ఆగష్టు 25 ప్రభాతవార్త: గత 25 సంవత్సరాలుగా జీహెచ్ఎంసీలో ఔట్ సోర్సింగ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలని జీహెచ్ఎంసీ ట్రేడ్ యూనియన్ సెల్ కమిటీ ప్రసిడెంట్ భవత్‌రెడ్డి ఆద్వర్యంలో కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ సాధనలో జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ముందు వరుసలలో ఉండి పనిచేశారని వారికి గుర్తు చేశారు. గతంలో సీఎం కేసీఆర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేస్తానని హామి ఇచ్చిన విధంగా తమను రెగ్యూలరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ జహీరుద్దీన్, సంజీవ్, వెంకటేష్, పాండు నాయక్, బాల నర్సింహ్మా, ప్రవీన్ కుమూర్, సంటికుమార్, నాను నాయక్, కళ్యాణ్ పాల్గొన్నారు.

## కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టను స్వాధీనం చేసుకున్న పోలీసులు



మైలార్‌దేవ్‌పల్లి, ఆగష్టు 25 ప్రభాతవార్త : కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తు న్న పరిశ్ర మపై రాజేం ద్రనగర్ ఎస్ఓటి పోలీ సులు దాడి జరిపి మూడు న్నర టన్నుల కల్తీ అల్లం వెల్లుల్లిని స్వాధీనం చేసుకున్నారు. అబిడ్స్‌లోని చిరాగ్ అలీనగర్‌కు చెందిన దిల్‌దార్ అలీ జషాన్ (45) ఉప్పర్‌పల్లిలోని గోల్డెన్ హైట్స్ కాలనీలో గత కొంత కాలం నుంచి కల్తీ అల్లం వెల్లుల్లి పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటి పోలీసు లు పరిశ్రమపై దాడి జరిపి మూడున్నర టన్నుల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టను స్వాధీనం చేసుకు న్నా రు. పరిశ్రమ యజ మాని దిల్‌దార్ అలీ జషాన్, మేనేజన్ సోను కుమార్‌లను అదుపులోకీ తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం రాజేంద్ర నగర్ పోలీ సులకు అప్పగించారు. ప్రమాదకరమైన రసాయనా లను ఉపయోగించి కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టను తయారు చేస్తున్నట్లు తనఖీలలో బయట పడింది.

# బైరాన్‌చెరువులో ఇద్దరు గల్లంతు

### ఒకరి మృతదేహం లభ్యం

నిజాంపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త : స్నానం చేయడానికి చెరువులోని దిగిన ఇద్దరు వ్యక్తులు గల్లంతైన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..న్యూఢిల్లికి చెందిన రాజు(35), ప్రకాశ్(45) అనే వ్యక్తులు గత ముప్పై సంవత్సరాలు క్రితం నగరానికి వలస వచ్చి బాచుపల్లిలో నివాసం ఉంటున్నారు. బాచుపల్లి ప్రధాన రహదారిపై వినాయక విగ్రహాలు తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఇరువురు కలిసి గురువారం సాయంత్రం సమయంలో మద్యం సేవించిన అనంతరం స్థానికంగా ఉన్న బైరాన్ చెరువులోని స్నానానికి దిగారు. ఈత రాకపోవడంతో చెరువులో మునిగి గల్లంతై య్యారు. రాత్రి పొద్దుపోయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో డిఆర్ఎఫ్ బృందం సాయంతో పోలీసులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా రాజు మృతదేహం లభ్యమైంది. మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.





దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్‌కెపురం అష్టలక్ష్మి ఆలయంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మివ్రత పూజలో పాల్గొన్న మహిళలు, పూజలందుకుంటున్న లక్ష్మి అమ్మవారు

## ఉజ్జయినీ మహాకాళీకి 108 సాకలు సమర్పణ



బేగంపేట ఆగస్టు 25,ప్రభాత వార్త : సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారికి ఐదవ శుక్రవారం రోజున 108 సాకలతో వెయ్యి మంది మహిళా భక్తులతో సాక సమర్పించారు. శ్రావణమాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం రోజున అమ్మ వారిని గాజులతో అందంగా అలంకరించారు. అమ్మ వారిని గాజుల అలంకారం లో చూసిన భక్తులు నిలు వెల్లా పులకించిపోయారు. వరల క్ష్మి వ్రతంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఓ గుత్తా మనోహర్ రెడ్డి, ఛైర్మన్, మరియూ ధర్మకర్తల మండలి సభ్యులు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆషాడ బోనాల జాతర సంద ర్భంగా తనకు ఐదు వారాల పాటు సాక సమర్పించాలని అమ్మ వారు కోరిన నేపధ్యంలో ఐదువారాలపాటు అమ్మవారికి ఆలయ అధికారులు సాక సమర్పించారు.

# మలుపు తిప్పల మల్కాజ్‌గిరి

## నేడే మైనంపల్లి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటన ▾ కార్యకర్తలతో సమావేశం



మల్కాజిగిరి నియోజకవర్గంగా ఆవిర్భవించిన తరువాత 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆకుల రాజేందర్ విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికలలో ఆయనకు టిక్కెట్ దక్కగ పోగా నందికంటి శ్రీధర్‌కు అవకాశం లభించింది. ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్ధి చింతల కనకారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2018లో చింతల కనకారెడ్డికి మళ్లీ టిక్కెట్ రాలేదు. మైనంపల్లి హనుమంతరావు అభ్యర్థిగా రంగంలోకి దిగి భారీ మెజారిటీతో విజయం సాధించారు. 2023లో పార్టీ నుంచి టిక్కెట్‌ను సాధించిన మైనంపల్లి పాత రికార్డును బద్దలు కొట్టారు. మెదక్ అసెంబ్లీ టిక్కెట్ విషయంలో వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. టిఆర్ఎస్ నుంచి పోటీలో ఉంటారా లేక మరో పార్టీ నుంచి బరిలో నిలుస్తారా అనే విషయం నేటితో తేలనున్నది.

### సిట్టింగులకు కలిసి రాదు అనే నియోజకవర్గంగా మల్కాజిగిరి ప్రచారం మరో పార్టీలోకి వెళతారా?

హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: కుమారుడికి టిక్కెట్ కేటాయించక పోవడంపై గరంగా ఉన్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నేడు శనివారం భవిష్యత్తు కార్యచరణను ప్రకటించనున్నారు. మెదక్ అసెంబ్లీ టిక్కెట్ కుమారుడు మైనంపల్లి రోహిత్‌కు ఇప్పించే విషయంలో తీవ్రంగా శ్రమించారు. టిక్కెట్ దక్కుతుందనే ఆత్మ విశ్వాసం ఆయనలో ఉండేది. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పద్మాదేవేందర్ రెడ్డిని కాదని రోహిత్‌కు టిక్కెట్ ఇచ్చే పరిస్థితి ఉంటుందా అనేది కూడా చర్చ జరిగింది. మెదక్ జిల్లాను పూర్తి స్థాయిలో శాసించే మంత్రి హరీశ్‌రావు కారణంగానే టిక్కెట్ దక్కలేదనే కోపంలో మైనంపల్లి ఉన్నారు. ఈ నెల 20వ తేదీన సీఎం కెసిఆర్ అభ్యర్థులు ప్రకటించిన విషయం తెలిసిందే. జాబితా లో తన పేరు ఉన్నా కుమారుడి పేరు లేకపోవడంతో మైనంపల్లికి ఆగ్రహం తెప్పించింది. హరీశ్‌రావు వలనే టిక్కెట్ లభించలేదని ఆయనపై ఫైర్ అవుతూ చేసిన వ్యాఖ్యలు దు మారం రేపాయి. అధికార పార్టీకి చెందిన నేతలు మైనంపల్లి వ్యాఖ్యలను ఖండించారు. ఎమ్మెల్యేకు సన్నిహితం గా ఉండే కెటిఆర్, కవితలు హరీశ్‌రావుకు మద్దతుగా నిలిచారు. పార్టీ పెద్దలు నుంచి వ్యతిరేకత వ్యక్తం అయిన నేపధ్యంలో మైనంపల్లి భవిష్యత్తుపై మీడియాలో అనేక కథనాలు చక్కర్లు కొట్టాయి. కాంగ్రెస్ లేదా బిజెపి పార్టీలులో చేరతారని ఊహా గానాలు చెలరేగా యి. మెదక్ అసెంబ్లీ టిక్కెట్ కుమా రుడికి మాల్కాజిగిరి తనకు కేటా యిస్తే పార్టీ మారే విషయాన్ని పరిశీలి స్తాననే సంకేతాలు ఆయా పార్టీలకు ఇచ్చారనేది ప్రధాన అంశంగా వార్తలు వచ్చాయి. ఇదిలా ఉండ గా వివాదం ముదిరిన తరుపాత టిఆర్ఎస్ అధిష్టానం ఇప్పటి వరకు మైనంపల్లిపై ఎటువంటి చర్యలకు ఉపక్రమించేదు. హరీశ్‌రావుపై తాను చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతమని పార్టీకి వ్యతిరేకంగా ఎక్కడా మాట్లాడలేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మైనంపల్లిని కాంగ్రెస్ లేదా బిజెపిలోకి చేర్చుకోవడానికి ఇరు పార్టీలు సానుకూలంగానే ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఓ జాతీయ పార్టీ రెండు సీట్లు ఇవ్వడానికి సిద్దంగా ఉన్నట్లు మరో జాతీయ పార్టీ ఒక అసెంబ్లీ మరోక పార్లమెంట్ స్థానం టిక్కెట్లుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే విషయంలో వరస కథనాలు వస్తున్నాయి. ఇవి ఎంత వరకు వాస్తవం అనేది పార్టీ శ్రేణులుతో జరిగే సమావేశం తరువాత తెలనున్నది.

> ఏది ఏమైనా సిఎం కెసిఆర్ దాదాపు సిట్టింగులకే టిక్కెట్లు అని మొదటి నుంచి చెబుతున్నా ఇస్తారో ఇవ్వరో అన్న సందేహం కొంతమంది ఎమ్మెల్యేలలో ఉన్నప్పటికి.. వారి సందేహా నికి అవకాశం లేకుండాపోయింది. సిఎం కెసిఆర్‌కు సొంత సామాజిక వర్గం ఎమ్మెల్యే నుంచే అధిష్టాన ధిక్కరణ కొంత పార్టీకి ఇబ్బంది కలిగించింది. తన కుమారుడికి మెదక్ అసెంబ్లీ టిక్కెట్టు ఇవ్వలేదని మంత్రి హరీష్‌రావుపై మైనంపల్లి మాటల యుద్ధానికి దిగడం బిఆర్ఎస్‌లో మాత్రం కొంత అలజడి రేపింది.

**సిట్టింగ్‌లకు కలిసిరాని మల్కాజిగిరి**

మల్కాజిగిరి అసెంబ్లీ సెగ్మెట్‌గా రూపాంతరం చెందిన తరువాత ఇక్కడి సిట్టింగ్‌లకు కాలం ఎన్నడూ కలిసి రాలేదనే చెప్పాలి. ఒక సారి గెలిచిన వారికి మంమోసారి టిక్కెట్ లభించిన దాఖలాలు లేవు. ఎమ్మెల్యే మైనంపల్లికి రెండవ సారి టిక్కెట్ దక్కినా వివాదాలు చుట్టుమట్టడంతో టిఆర్ఎస్ పార్టీ నుంచి ఆయన పోటీ చేస్తారా అనేది ప్రశ్నగా మారింది. టిఆర్ఎస్ ప్రకటించిన అభ్యర్థులు జాబితో ఆయన పేరు ఉంది. కుమారుడి కోసం పార్టీ వదులుకుంటారా అనేది నేటితో తేలుతుంది.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ చీమా శ్రీనివాస్

**రేపు చలో హైదరాబాద్ పేరిట**

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు

సైఫాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, పదివేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న చలో హైదరాబాద్ పేరిట 'తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మగౌరవ సదస్సు' ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటి ప్రక టించింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఈ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్ ను, కరపత్రాన్ని ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, బిజెపి నేత ఈటల రాజేందర్, తెలంగాణ జన సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదం డరామ్ హా జరవుతారని చెప్పారు. రాష్ట్రం నలు మూలల నుంచి వేలాది మంది ఉద్యమకారులు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాల ని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫోరం ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, సంగా సుదర్శన్, శ్రీనివాస్‌గౌడ్, రవీంద్రచారి, జెరు షాలేం మత్తయ్య, నాగేళ్ళ పోచయ్య పాల్గొన్నారు.

## కరాటే నిత్య సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

**ప్రముఖ సినిమా హీరో సుమన్**



21వ జాతీయ ఓపెన్ కరాటే కుంగ్ ఫూ చాంపియన్‌షిప్ -24లో సత్తా చాటిన వారిని అభినందిస్తున్న ప్రముఖ హీరో సుమన్

నార్సింగి, ఆగష్టు 25 ప్రభాతవార్త : కరాటే విద్య నిత్య సాధనతో సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రముఖ సినిమా హీరో సుమన్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన 21.వ,జాతీయ ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌సిప్-2024లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేసి అభినందిం చారు. గండిపేట మండలం మణికొండకు చెందిన విద్యార్థుల ఈ పోటీలలో పాల్గొని సత్తా చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుమన్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఆత్మరక్షణ విద్య నేర్చుకోవడం తప్పని సరిగ్గా మారిందన్నారు. ము ఖ్యంగా బాలికలు, యువతులు ఈ కరాటే విద్యను నేర్చుకుంటే, అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు వారి కాళ్లు, చేతులనే ఆయుధాలుగా మార్చుకొని మాన, ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు.

### దోపిడీ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

సైఫాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: డిక్కి సంస్థ పేరుతో బ్యాంకు ఉద్యోగులను, ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులను చూపించి మాయమాటలతో మోసం చేసి దళితుల నుంచి కోట్లాది రూపాయలను దోపిడీ చేసిన పుట్టపాగ శ్రీనివాస్‌పై కఠినంగా చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వానికి మొర పెట్టు కున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని లేకపోతే తమకు ఇక ఆత్మహత్యలే శరణ్యమని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు కందుల రాములు, శ్రీరాం సత్యనారాయణ, చంద్రశేఖర్, నవీన్, వెన్నెల, లత, చేతన్, ఎర్ర వెంకటేష్, రమాదేవి మాట్లాడారు.

# గాంధీభవన్‌కు పోటెత్తిన అభ్యర్థులు

**కాంగ్రెస్‌లో దరఖాస్తుల వెల్లువ**

**ఎల్బీనగర్ నుంచి మధుయాష్కీ గౌడ్**

**ముషీరాబాద్ నుంచి అంజన్‌కుమార్‌యాదవ్**

**కంటోన్మెంట్ నుంచి సర్వే సత్యనారాయణ**



హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త : రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ నుంచి అగ్రనేతలు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే వారి వారసులు సైతం అభ్యర్థిత్వం కోసం ఆర్జీలు పెట్టుకున్నారు. దరఖాస్తులకు శుక్రవారం చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున అశావహులు గాంధీభవన్‌కి చేరుకున్నా రు. కాంగ్రెస్ తరపున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నా రు. దీంతో పార్టీ ముఖ్య నేతలంతా దరఖాస్తు చేసు కున్నారు. కొందరు నేతలు పెద్దఎత్తున అనుచరుల తో కలిసి వెళ్లి దరఖాస్తు పెట్టుకోగా, మరికొందరు చడీచప్పుడు లేకుండా ముందే గాంధీభవన్‌లో ఆర్జీలు పెట్టుకున్నారు. ఎవరికి వారే టిక్కెట్ వస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం ఆపార్టీ ప్రచార కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపి మధుయాస్కీ గౌడ్ దరఖాస్తు చేసుకున్నారు. ఉప్పల్ నుంచి ఎం.పరమేశ్వర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్‌రెడ్డి, ఎస్.సోమశేఖ ర్‌రెడ్డిలు దరఖాస్తు చేశారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి నందికంటి శ్రీధర్ దరఖాస్తు చేశారు. కుత్బుల్లాపూర్ నుంచి కొలను హనుమంతరావు, నర్సారెడ్డి భూపతిరెడ్డి, సోంటిరెడ్డి పున్నారెడ్డి, జీవేందర్‌రెడ్డి, జ్యోత్స్నారెడ్డి ఉన్నారు. జూబ్లీహిల్స్ నుంచి మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపి అజారుద్దీన్, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి సత్యం శ్రీరంగం, గొట్టిముక్కల వెంగళరావులు దరఖాస్తు చేశారు. శేరిలింగంపల్లి నుంచి జెరిపేటి జయపాల్, రఘునాథ్‌యాదవ్‌లు దరఖాస్తు చేశారు. ముషీరాబాద్ టికెట్ కోసం తండ్రీకుమారులు దరఖాస్తు చేసుకున్నారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్, అతని కుమా రుడు అనిల్‌కుమార్ యాదవ్‌లు ముషీరాబాద్ స్థానం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

అంబర్‌పేట టికెట్ కోసం పార్టీ ఒబిసి సెల్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, పార్టీ కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, రోహిత్‌లు దర ఖాస్తు చేసుకున్నారు. సనత్‌నగర్ టికెట్ కోసం పిసిసి ప్రధాన కార్యదర్శి కోట నీలిమ, సరోజినిదేవి కంటి వైద్యశాల మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్ గౌడ్‌లు దరఖాస్తు చేసుకున్నారు. ఖైరతాబాద్ నుంచి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, పిజెఆర్ కుమార్తె, కార్పొరేటర్ విజయారెడ్డి, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సునితారావు తదితరులు దర ఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. మహేశ్వరం నుంచి కొత్త మనోహర్‌రెడ్డి, చెల్ల నర్సింహారెడ్డి ఉన్నారు. కంటోన్మెంట్ నుంచి మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ దరఖాస్తు చేశారు. ఆయనతో పాటు అక్కడి నుంచి దరఖాస్తు చేసినవారి లో పిడ మర్తి రవి, బొల్లు కిషన్, జీవకన్‌లు ఉన్నా రు. సికింద్రాబాద్ నుంచి నోముల ప్రకాశ్‌గౌడ్, ఆదం సంతోష్‌కుమార్, నాగులూరి సాయిబాబా ఉన్నారు.

## సర్వస్వతి దేవి అమ్మవారికి ఆభరణాల అందజేత



చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: శ్రావణ వరలక్ష్మి వ్రతమహోత్స వాన్ని పురస్కరించుకుని శుక్రవారం ముషీరాబాద్‌లోని శృంగేరి పీఠం జ్ఞానసరస్వతి అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. పెద్దసంఖ్యలో భక్తులు హాజరవడంతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా భక్తులకు ఎటు వంటి ఇబ్బందులు కలగకుండా ఆలయం ధర్మాధికారి కళావిఎస్.జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తుల సహకారంతో రూపొందించిన అమ్మవారికి స్వర్ణముఖం, రజిత జడ, రజిత వస్త్రం, ధార పాత్రతో పాటు రెండు వెండి ఏనుగులను అర్చకులకు అందజేసి అమ్మవారికి ఈ సందర్భంగా అలంకరణలు చేశారు. కళావిఎస్.జనార్ధనమూర్తి మాట్లాడుతూ సరస్వతి దేవి అమ్మవారి అనుగ్రహానికి భక్తులు భక్తిప్రపత్తుల తో ఈ విధంగా అలంకరణల కు సంబంధించి ఆభర ణాలు అందించడం విశేష మన్నారు. శృంగేరి పీఠా ధిపతి భారతీతీర్థస్వామి, విదుశేఖర భారతీస్వామి దివ్యఆశీస్సులతో దేవాల యాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు సదుపా యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జ్వాల నరసింహేశ్వవర వైకుం ఠం, పిరాట్ల కామేశ్వరమ్మ, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు ప్రారంభించిన పద్మారావు గౌడ్



సికింద్రాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్తః సికింద్రా బాద్ పరిధిలోని వివిధ ఫం క్షన్ హాల్స్‌ను పేద, మధ్య తరగతుల వారికి అందు బాటులో ఉండేలా తీర్చిదిద్దా మని, పేదలు కూడా ఆత్మ గౌరవంతో శుభకార్యాలను జరుపుకొనేలా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండి డివిజన్‌లోని మధురానగర్ కాలనీలో నిర్మించిన నూతన కమ్యూనిటీ హాల్‌లో రూ. 50లక్షల ఖర్చుతో చేపడుతున్న అదనపు అంతస్తుల నిర్మాణం పనులను పద్మారావు గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యాక్రమం లో కార్పొరేటర్ సామలహేమ, జలమండలి డీజీఎం వై. కృష్ణ, కౌశిక్, అన్విత్, నేతలు రామేశ్వర్‌గౌడ్; పవన్‌కుమార్ గౌడ్, జహంగీర్ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి దృష్టికి కార్మికుల డిమాండ్లు


కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ఎమ్మెల్యే మాధవరం**

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 25, ప్రభాతవార్త : కార్మికుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కూకట్‌పల్లి నియోజకవర్గం శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఇటీవల జిహెచ్ ఎంసి కార్మికులు తమను శాశ్వత నియామ కాలు కింద తీసుకోవాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం కూకట్‌పల్లి జోన్ మున్సిపల్ కార్యాలయం మూసాపేటలోని కార్మికులు వద్దకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వెళ్లి వారికి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఒక కార్మికుడినేని కార్మికుల బాధను అర్థం చేసుకున్న వ్యక్తిగా తమ న్యాయమైన డిమాండ్లను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ సందర్భంగా గతంలో 6వేలు ఉన్న జీతాన్ని నేడు రెట్టింపు చేసి 17,500 చేసిన నాయకుడు ముఖ్యమంత్రి కెసిఆర్ అని తమ డిమాండ్లను తప్పనిసరిగా ఆయన దృష్టికి తీసుకెళ్తానని ఖచ్చితంగా సానుకూలంగా స్పందిస్తారని ఇందులో ఎటువంటి సందేహం లేదని అన్నారు.

## ఆత్మవిశ్వాసంతో యువత ముందడుగు వేయాలి : ఎమ్మెల్యే వివేకానంద్


శ్రీ నవశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ ను ఆవిష్కరిస్తున్న కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ తదితరులు

**నవశక్తి సంక్షేమ సంఘ కార్యవర్గ ఏర్పాటు**

కుత్బుల్లాపూర్, ఆగస్టు 25 ప్రభాతవార్త : యువత స్వశక్తితో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని సత్తాచాటాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం శ్రీ నవశక్తి వెల్ఫేర్‌అసోసియేషన్ నూతన కార్యవర్గ ఏర్పాటు సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరామ్‌నగర్ బి కి చెం దిన శ్రీ నవశక్తి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎం.డి.మజీద్, ఉపాధ్యక్షులుగా బబ్లు, జి.బాస్కర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా ఎన్.హరీష్‌కుమార్, ఎండి. అహ్మద్ అలీ, కోశాధికారిగా రాకేశ్ కేసరి, క్రియాశీలక అధ్యక్షులుగా ఎ.నరేందర్, రఫియుద్దీన్, కార్యదర్శులుగా యు.నాగరాజు, ఎస్.వెంకయ్య, ఎం.డి. అహ్మద్, పి.శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కిరణ్‌కుమార్, సి.వెంకటేశ్, సలీమ్, సహాయ కార్యదర్శులుగా ఎం.డి.నజీర్, ఎం.డి.అఫ్జల్, సభ్యులుగా చాంద్‌పాషా, అశ్వక్, రమేశ్, చిన్నా, షరీఫ్, కుమార్, అజీమ్, ఇస్మాయిల్, ఎండి. సల్మాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా శాసనసభ్యులు కె.పి.వివేకానంద్, కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, శంభీపూర్‌రాజు, డి.విజయరామిరెడ్డి, డి.తిరుపతిరెడ్డి, సిహెచ్.మధుబాబు, సంజీవ రెడ్డి, పాండురెడ్డి, ఎన్.గోపిలను ఎన్నుకున్నారు.

# ప్రతి ఒక్కరు గెలుపుకోసం కృషి చేయాలి

**ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి**


ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బిఎల్ఆర్‌ను సన్మానిస్తున్న కార్పోరేటర్ పన్నాల ఇతర నేతలు

నాచారం, ఆగస్టు 25 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు గెలుపుకోసం కృషి చేయాలని ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవాంర మల్లాపూర్ డివిజన్‌లోని వార్డు కార్యాల యంలో నాయకులు, కార్యకర్తలతో బిఎల్ ఆర్ సమావేశం అయ్యారు. అందరు కలిసి కట్టుగా ఉండి పార్టీ గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలని అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని బిఎల్ఆర్ చెప్పారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు, బిఎల్ఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాపోలు సతీష్, చిగుళ్ల శ్రీనివాస్, కుంటి కృష్ణ, తీగుళ్ల శ్రీనివాస్, కటర్ల భాస్కర్, తండా వాసుగౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి, ధర్యారెడ్డి, నాగారం బాబు, దుర్గయ్య, శోభ, కోటేశ్వరీ, బుసాని రఘు, విజయ్ భాస్కర్, సుశీల, లక్ష్మి, అల్లూరి నరేందర్ రెడ్డి, నయిమ్, పీరు నాయక్, శంకర్ నాయక్, పద్మరెడ్డి, మారుతి, అల్తాఫ్, బాసిత్ పాల్గొన్నారు.

# మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన గండిపేట బిఆర్ఎస్ నాయకులు



నార్సింగి, ఆగస్టు 25 ప్రభాతవార్త : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డికి శుక్రవారం గండిపేట మండల బిఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానిం చి, పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గండిపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, నార్సింగి మున్సిపల్ వైస్ ఛైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్ శివారెడ్డి, సీనియర్ నేతలు గోపాల గణేష్, దారుగుపల్లి యాదగిరిలు మంత్రిని సన్మానించారు. సందర్భంగా నర్సిహ్మా మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రెండోమారు మహేందర్‌రెడ్డి మంత్రి పదవిని చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో, పార్టీ పటిష్టతలో మహేందర్‌రెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించి సీఎం మంత్రిగా అవకాశం కల్పించారన్నారు. మహేందర్‌రెడ్డి నుంచి రంగారెడ్డి జిల్లాలోని చాలా మంది నాయకులు స్ఫూర్తి పొంది, రాజకీయంలో రాణిస్తున్నారని నర్సిహ్మాతెలిపారు.

## సిఎం కెసిఆర్‌తోనే మండల్ కమిషన్ సిఫార్సులు అమలు సాధ్యం

**తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర**



హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: సిఎం కెసిఆర్‌తోనే మండల్ కమిషన్ సిఫార్సులు అమలు సాధ్యం అని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర పేర్కొన్నారు. బీపీ మండల్ జయంతి సభ నల్లకుంటలోని రత్నానగర్‌లో బీసీ జాగృతి ఆధ్వర్యంలో జరిగింది. బీపీ మండల్ చిత్రపటానికి ముఖ్యఅతిథిగా హా జరైన ఉపేంద్ర నివాళులు అర్పించి ప్రసంగిం చారు. దేశాన్ని ఎక్కువకాలం పరిపాలించిన కాంగ్రెస్, బిజెపిలు మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకపోవడం అన్యాయమని, మండల్ కమిషన్ 1980లోనే దేశంలో కులగణన జరగాలని చెప్పారని, కానీ నేటికి కులగణన జరగకపోవడం బీసీల పట్ల వారి వైఖరికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే కులగణన చేపట్టాలని,బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో 33శాతం బీసీలకు రిజర్వేషన్‌లు ప్రకటించాలని, మండల్ కమిషన్ ద్వారానే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27శాతం రిజర్వేషన్‌లు బీసీలకు దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెపి.మురళీకృష్ణ, కత్తుల సుదర్శన్, కార్యదర్శి పాతకోటి మహేష్, కార్యవర్గసభ్యులు ఎం.బి.కిషోర్, ప్రశాంత్ ముదిరాజ్, సురేందర్, బస్తీ నాయకులు వెంకటేశ్, జహర్ పాల్గొన్నారు.

# మణిపూర్ బాధితులు అధైర్య పడవద్దు : పూల ఆంథోనీ


మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనకు నిరసనగా సికింద్రాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్ మైనార్టీ ప్రతినిధులు

అడ్డగుట్ట, ఆగస్టు 25 ప్రభాతవార్త: మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనకు నిరసనగా శుక్రవారం సికింద్రాబాద్‌లోని వివిధ చర్చీల ఫాదర్లు,క్రైస్తవ సంఘ నాయకులు, సభ్యుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్చీ బిషప్, ఆఫ్ హైదరాబాద్ కార్డినల్ పూల ఆంథోనీ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో ఒక వర్గంపై హింసాత్మకమైన దాడులు జరుపడం సరైంది కాదన్నారు. చర్చీలు ధ్వంశం చేస్తూ అల్లర్లు సృష్టిస్తూ ప్రజా స్వామ్య విలువలను లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ ప్రతినిధులు జీవకన్, మైఖేల్, లియో, వాయుడిన్ బ్రోత్, విక్టర్ పాల్గొన్నారు.

# రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బేగంబజార్,ఆగస్టు25(ప్రభాతవార్త):శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సౌత్,అండ్ వెస్ట్‌జోన్ అడిషనల్ డిసిపి మొహమ్మద్ ఆశ్వాక్,గోషామహల్ ఎసిపి కె.వెంకట్‌రెడ్డిలు రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టడం జరుగతుంద న్నారు. పండుగలలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో సిఐ.రవికుమార్,అదనపు ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, ఎస్ఐలు అస్లాం,అంబికా, సాయికృష్ణ,శ్రీరాములు తదితరులు ఉన్నారు.

## బస్తీవాసులకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలి


వినతి పత్రం అందిస్తున్న నేతలు

అల్వాల్, ఆగస్టు 25 ప్రభాతవార్త: దశాబ్దాలు కాలంగా నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న పేదలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని భారతీయ జనతాపార్టీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఓల్డ్‌అల్వాల్ సాయినగర్ కాలనీలోని విద్యుత్ కార్యాలయం వద్ద బస్తీ వాసులుతో కలిసి నేతలు నిరసకు దిగారు. జొన్నబండ వద్ద వడ్డెర కులస్తులు సుమారు ఏడు దశాబ్ధాలు నుంచి నివాసం ఉంటున్నారని ఓబీసీ మెర్చా రాష్ట్ర నాయకుడు దండుగుల వెంకటేష్ తెలిపారు. ఇంటి నెంబర్లు, ఆస్థి పన్ను ఉన్నా మీటర్లు ఇవ్వ డానికి ఎందుకు జంకుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఫుట్‌పాత్‌లుపై వ్యాపారాలు చేసుకునే వారికి మీటర్లు ఇచ్చే అధికారులు ఇళ్ళకు ఇవ్వడంతో వచ్చిన ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నేతలు మల్లిఖార్జున్ గౌడ్, కార్తీక్ గౌడ్, రవి, కిరణ్, మల్లిఖార్జున్ యాదవ్, మచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సికింద్రాబాద్‌ను కాంగ్రెస్ కంచుకోటగా మార్చాలి

**నాగులూరి సాయిబాబా**


నేతలు, కార్యకర్తలతో సమావేశమైన నాగులూరి సాయిబాబా

సికింద్రాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త : రానున్న ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యాకర్తలు కృషి చేయాలని ప్రముఖ సంఘ సేవకుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా అన్నారు. సికింద్రా బాద్ నియోజకవర్గం కార్యాకర్తల సమావేశం చిలకలగూడ లో జరిగింది. ఈ కార్యాక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండేదని తెలిపారు. తిరిగి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో పాగా వేయడం కోసం కార్యకర్తల సమిష్టి కృషి అవసరమన్నారు. నాయకులు, కార్యకర్తలు కనీసం వంద రోజుల పాటు పార్టీ అభివృద్ధి కోసం కంకణం కట్టుకోవాలన్నారు. ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలను చైతన్యం చేయాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యాక్రమంలో నేతలు సందీప్‌రాజు, గంట రాజు సాగర్, షబీనా, లలిత సింగ్ ఇతర నేతలు పాల్గొన్నారు.

# పెలికాలన్ సిగ్నల్స్ ప్రారంభం


సిగ్నల్స్‌ను ప్రారంభిస్తున్న ఎసిపి వెంకటరెడ్డి తదితరులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి సుచిత్రలోని లయోల కళాశాల వద్ద పాదచారులు రోడ్డును దాటేందుకు ఏర్పాటు చేసిన పెలికాన్ సిగ్నల్స్‌ను మేడ్చల్ ట్రాఫిక్ డివిజన్ ఎసిపి కె.వెంకట్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశానుసారం పాదచారుల సౌకర్యార్థం పెలికాన్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ పిఎస్ సిఐ నాగేశ్వరరావు, ఎస్సైలు ప్రశాంత్‌రెడ్డి, శ్యామ్‌బాబు, లయోల కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్**


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

మెహిదీపట్నం, ఆగస్టు 25, ప్రభాతవార్త : కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్నటువంటి అభివృ ద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది నిధులను విడుదల చేయించి అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. మజ్లిస్ పార్టీతోనే కార్వాన్ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ ఈఈ రామకృష్ణతో కలిసి టోలిచౌకి, నానల్‌నగర్, గోల్కొండ డివిజన్‌లలో పర్య టించి అభివృద్ధి పనుల ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ.. కార్వాన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి సమస్యలు లేని నియోజక వర్గంగా తీర్చిదిద్దుతున్న ఘనత మజ్లిస్ పార్టీకే దక్కుతుం దన్నారు. నిత్యం ప్రజలు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట నాయకులు మహ్మద్ నసీరుద్దీన్, హారా న్ ఫరాన్, బద్రుదుద్దీన్, ఏఈ వెంకటశేషయ్యలతో పాటు స్థానికులు ఉన్నారు.

## మారేడ్‌పల్లి డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లపై సర్వే

అడ్డగుట్ట, ఆగస్టు 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజ కవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన లబ్దిదారులకు కేటాయిం చేందుకు శుక్రవారం సికింద్రాబాద్ అర్‌డిఓ రవి, మారేడ్ పల్లి తహశీల్దార్ పద్మసుందరీల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.ఐ.రాధిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు మల్లేశ్వర్ రెడ్డి, నర్సింగ్, స్వర్ణ, వంశీ, సదానంద్ గౌడ్, శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మంత్రికి టికెట్ ఖరారు చేయడం అభినందనీయం : యాదగిరి

కంటోన్మెంట్,ఆగస్టు 25 ప్రభాతవార్త: గ్రేటర్ ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో సనత్ నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఖరారు చేయడంతో శుక్రవారం స్వచ్ఛ గ్రేటర్ హైదరాబాద్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతలు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బి.యాదగిరి, ప్రధాన కార్యదర్శి టీ.నర్సింగ్‌రావ్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాజుకుమార్, సలహాదారులు బి.బాబు,క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వం క్రైస్తవుల పట్ల సానుకూలంగా ఉంది

**క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వరరావు**

చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: రాష్ట్రంలో క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణ సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని హెబ్రోన్ చర్చ్ చైర్మన్, దైవసేవకులు జోసెఫ్ పి.కురియన్, ప్రధాన కార్యదర్శి ఆర్.వీరాచారి(పీటరాచారి) ఆధ్వర్యంలో కార్పొరేషన్ నూతన చైర్మన్‌గా నియమితులైన డి.రాజజేశ్వరరావును సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కురియన్, పీటరాచారి మాట్లాడుతఊా రాష్ట్ర ప్రభుత్వానికి క్రైస్తవుల పట్ల సానుకూలంగా ఉన్నారని, గతంలో క్రైస్తవ ఎమ్మెల్సీగా డి.రాజేశ్వరరావు చేసిన పనులకు గుర్తింపుగా సిఎం కెసిఆర్ చైర్మన్‌గా మరోసారి అవకాశం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు మరోసారి బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చినందుకు సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## 60 లక్షలతో మంచినీటి పనులకు శంకుస్థాపన


రోడ్డు పనులకు శంకుస్తాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: అంబర్‌పేట లోని అయ్యప్పస్వామి ఆల యం ఎదురుగా ఉన్న బ్యాంకు లైన్‌లో 60 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పను లకు శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరే టర్ పద్మావెంకట్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రక్కనే ఉన్న జామ్ జామ్ మజీద్ రోడ్డులో 40 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను పరిశీలిం చి పురోగతి గురించి అధికారులతో మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో ఏలాంటి లోపం లేకుండా నిర్ణిత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న మంచినీటి పైప్‌లైన్ పనులు, సిసి రోడ్డు పనులు చేయిస్తున్న ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## బిఆర్ఎస్, బిజెపి పార్టీలను ఓడించకపోతే దళిత బహుజనులకు బానిసత్వం తప్పదు

**డిబిపి జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ హెచ్చరిక**

సైఫాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: తెలంగాణలో కార్పొరేట్ వ్యాపార రాజకీయాలు నడుపుతున్న బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ సూచించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కొక్క సీటును కోట్ల రూపాయలకు ఈ మనువాద పార్టీలు అమ్ముకుంటున్నాయని, ఇప్పటికే అడ్వాన్స్‌లు తీసుకుఉంటున్నా యని ఆరోపించారు. శుక్రవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి లక్ష కోట్ల రూపాయలు బ్లాక్ మనీతో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు సిద్ధంగా ఉన్నాయని, ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియను ఖూనీ చేస్తున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయ విషపాములైన బిఆర్ఎస్, బిజెపిల ఓడించకపోతే దళిత బహుజనులకు బానిసత్వం తప్పదని హెచ్చరించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


ఎమ్మెల్సీ రాజుకు వినతి పత్రం అందజేస్తున్న సంక్షేమసంఘం ప్రతినిధులు

దుండిగల్, ఆగస్టు 25 ప్రభాతవార్త: కుత్బు ల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సంక్షేమ సంఘాల నాయకులు శుక్రవారం ప్రభుత్వవిప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షు లు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆయన కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆయా ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి త్వరితంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ఎన్ని నిధులైనా కేటాయించేందుకు కెసిఆర్ ప్రభుత్వం సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రేమికుల కథాంశంతో వసంతరాజీయం చారిత్రక పద్యనాటకం

నాంపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త : లకుమ అనే నర్తకి వసంతరాజు వద్ద వసంతోత్సవాల్లో నాట్యంచేసి రాజును మెప్పించి రాజనర్తకి అవుతుంది. నాట్యం భూమికగా వసంతరాజీయం నాట్యశాస్త్ర గ్రంథం వ్రాస్తూ ఆమె ప్రేమలో పడతాడు రాజు, ఆమె కూడా రాజును ప్రేమిస్తుంది. అనంతరం గగుర్పొల్పే పరిణామాల సాగిన ఆ ప్రేమికుల కథాంశమే వసంతరాజీయం చారిత్రక పద్యనాటకం. ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ ప్రతీనెలా ప్రదర్శించే నాటకంలో భాగంగా ఈ నెల 28 సోమవారం రాత్రి 6.45గంటలకు రవీంద్రభారతి ప్రధాన మందిరంలో హయత్‌నగర్ మురళీకృష్ణ సాంస్కృతిక కళాసంఘం సమర్పణలో తడకమళ్ల రాంచందర్‌రావు రచన; అంజిరెడ్డి సోమ దర్శకత్వంలో రూపొందిన చారిత్రక పద్యనాటకం నటీనటులు అంజిరెడ్డి, వెంగమాంబ, హరినాథ్, సదానందం; డా. శ్రీజ సాదినేని; అవినాష్, సాళ్వాచారి అద్భుత నటలో వసంత రాజీయం ప్రదర్శింపబడనుందని, అధికసంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి నాటకాన్ని ఆసాంతం తిలకించి కళాకారులను ప్రోత్సహించి ప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు.

# ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌కు ఘనంగా సత్కారం

హైదరాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గం జన హృదయనేత, ప్రియతమ నాయకుడు, పేదల పెన్నిధి కాలేరు వెంకటేష్‌కు రెండోవసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా సిఎం కెసిఆర్ ప్రకటించినందుకు అంబర్‌పేట బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం డివిజన్‌లోని ఎకె ప్లాజా ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్ ఆధ్వర్యంలో ముస్లీం, మైనార్టి సోదరులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ ప్రజల అశీస్సులు, ముఖ్యమంత్రి కెసిఆర్ తనకు రెండోవసారి పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని చెప్పారు. ఇందుకు ఆయన సిఎంకు ధన్యవాదాలు తెలిపారు.

# కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం ర్యాలీగా సర్వే


కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం గాంధీ భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ

కంటోన్మెంట్,ఆగస్టు 25 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు టికెట్ కేటాయించాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్య నారాయణ శుక్రవారం సికింద్రాబాద్ మహేంద్రహిల్స్ నుంచి గాంధీ భవన్‌కు భారీ ఊరేగింపుతో తరలివెళ్లి కంటోన్మెంట్ ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తును అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కంటోన్మెంట్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అల్లాడి గౌరి శంకర్, నంది కంటి రవి, బద్దం బల్వంత్ రెడ్డి, దండుగుల యాదగిరి, సర్వేశ్, డి.బాబురావ్, ఆర్.డి.నాగేశ్ యాదవ్‌లతో పాటు కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు మహేంద్రహిల్స్‌లోని సర్వే నివాసం నుంచి ఊరేగింపుగా గాంధీ భవన్‌కు తరలివెళ్లారు.

## ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నుంచి అవకాశం కల్పించండి

చిక్కడపల్లి, ఆగస్టు 25 ప్రభాతవార్త: ఎఐసిసి ఫిషర్ మెన్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బిజ్జు శత్రు రావు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం శుక్రవారం దరఖాస్తు సమర్పించారు. గాంధీభ వన్‌లో ఈ మేరకు కాంగ్రెస్ నేతలు కన్నా డానియేల్, కాంగ్రెస్ నేతలు ఖాదర్, శ్రీకాంత్, రాము, వేణు తదితరలతో కలిసి అందించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు వివరించారు. తనకు టికెట్ లభిస్తుందని ఆశిస్తున్నానని అన్నారు.

## సత్తా చాటిన భారత ఇస్రో శాస్త్రవేత్తలు


కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

చార్మినార్,ఆగస్టు 25 ప్రభాతవార్త : చంద్రయాన్-3 విజయం భారత అంతరిక్ష శాస్త్రవేత్తల సత్తాను ప్రపంచానికి చాటిందని ది ప్రొగ్రాస్ హైస్కూల్ (ఇంజన్‌బౌలి) వైస్ చైర్మన్ మీర్జా మహ్మద్ అలీ బేగ్ అన్నారు.పాతబస్తీ ఇంజన్‌బౌలి-ఫలక్‌నుమాలోని ప్రొగ్రాస్ హైస్కూల్‌లో పాఠశాలకు చెందిన విద్యార్థు లు చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి భారత పౌరులైన విద్యార్థులు మంచి లక్ష్యాలను ఎంచుకుని విజయవంతం కోసం కృషి చేయాలని తెలిపారు.చంద్రుడి దక్షిణ ధృవంపై తొలి సారిగా అడుగు పెట్టి భారత సత్తాను ప్రపం చానికి చాటడం ఎంతో గర్వంగా ఉందని ఆయన తెలియజేశారు. విద్యార్థులు మంచి క్రమ శిక్షణ, పట్టుదలతో చదివితే శాస్త్రవేత్తలు కూడ అవు తారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల లకు చెందిన ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# మానిక్‌రావును గోషామహల్ బిఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షులు వెంకటేష్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 25 ప్రభాతవార్త: గోషామహల్ టిక్కెట్ దళిత నేత మానిక్‌రావుకు కేటాంచాలని ఆరుంధతి సేవా మండలి నాయకులు ముఖ్యమంత్రి కెసిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు చుడీ బజార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలు దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆరుంధతి సేవా మండలి ఉపాధ్య క్షులు డి.వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ విడుదల చేసిన 115 ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా ప్రకటించారు. అందులో గోషామహల్ నియో జకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి పేరు ప్రకటించలేదని, అందుకు మానిక్‌రావు పేరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన కోరారు. మాణిక్‌రావుకు కేటాయిస్తే దళిత సంఘాలు పూర్తి మద్దతుతో గెలుపించుకుంటామ న్నారు. ఈ సమావేశంలో ప్రతినిధులు చంద్రమోహన్, ఎం.బాల్‌రాజ్, పి.వెంకటేష్, డి.నాగేశ్వర్‌రావు, ఎస్.కుమార్ పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో 'సూపర్ ట్విన్స్'

**సత్తాచాటిన నగర విద్యార్థులు అమయ, అనయ్ అగర్వాల్**

**అక్టోబర్ 15న ఈజిప్ట్‌లో జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అవకాశం**


తల్లిదండ్రులు కోచ్‌లతో చిన్నారులు అమయ,అనయ్ అగర్వాల్

హైదరాబాద్, ఆగస్టు 25,ప్రభాతవార్త: నగరానికి చెందిన సూపర్ ట్విన్స్ ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటారు. ట్విన్స్ అంటే ఇద్దరు అబ్బాయిలు ,ఇద్దరు అమ్మాయిలు కాదండోయ్ ..ఒక అమ్మాయి, ఒక అబ్బాయి.. గతవారం స్పెయిన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో మంచి రేటింగ్‌తో అండర్ -8 బాయ్స్, గర్ల్స్ కేటగిరీల్లో ఇద్దరూ ఛాంపియన్స్‌గా నిలిచారు. ఈసందర్భంగా శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోచ్ లు చైతన్య, స్రవంతిలు మాట్లాడుతూ అమయ అగర్వాల్, అనయ్‌అగర్వాల్ అండర్ -8, కేటగిరీలో ఇప్పటికే నేషనల్ ఛాంపియన్స్‌గా నిలిచి గతవారం స్పెయిన్ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారన్నారు. దీంతో అక్టోబర్ 15నుంచి ఈజిప్టులో జరిగే వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. విజేతలు అమయ, అనయ్ అగర్వాల్‌లు మాట్లాడుతూ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు వెల్లడం చాలా సంతోషంగా ఉందని దీనికి కోచ్‌లు, తల్లిదండ్రుల సహకారం మరువలేదన్నారు. వారి ప్రోత్సాహంతోనే ప్రపంచ ఛాంపియన్స్‌గా నిలిచామన్నారు. రాబోయేరోజుల్లో అందరి సహకారంతో వరల్డ్ ఛాంపియన్‌గా నిలిచేందుకు కృషి చేస్తామన్నారు. తక్కువ సమయం లోనే తమ పిల్లలు అత్యుత్తమ ప్రతిభతో రాణిస్తున్నారని ..అమయ, అనయ్ వరల్డ్ చాంపియన్స్‌గా తప్పక విజయం సాధిస్తారని తల్లిదండ్రులు తనాషా అగర్వాల్, వరుణ్ అగర్వాల్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# కార్పొరేటర్ వంగ ఇంటిని ముట్టడించిన బిఆర్ఎస్ శ్రేణులు

## బిఆర్ఎస్, బిజెపి శ్రేణుల పోటా పోటీ నినాదాలతో దద్దరిల్లిన కర్మన్‌ఘాట్


ఘర్షణ పడుతున్న బిఆర్ఎస్, బిజెపి శ్రేణులు


కార్పొరేటర్ వంగ మధు ఫ్లెక్సీని చెప్పులతో కొడుతున్న మహిళలు


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

**సైదాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యాలు, దుర్భాషలను నిరసిస్తూ శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున కర్మన్‌ఘాట్‌లోని కార్పొరేటర్ ఇంటిని ముట్టడించి ఆందోళనకు దిగారు. క్రాంతి క్లబ్ నుంచి ర్యాలీగా కార్పొరేటర్ ఇంటి వద్దకు చేరుకున్నారు. కార్పొరేటర్ ఫ్లెక్సీకి పూలదండ వేసి చెప్పులతో కొడుతూ నిరసన వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ శ్రేణుల ఆందోళన గురించి తెలుసుకున్న బిజెపి నాయకులు అక్కడకు చేరుకోవడంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాలు ఒకరినొకరు దూషించుకుంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భౌతిక దాడులు చేసుకున్నారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అయితే అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు ఘర్షణ పడుతున్న ఇరువర్గాల వారిని పక్కకు నెట్టి వేసి సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. అయితే ఎవరు కూడా తగ్గకపోవడంతో రసాభసాగా మారి కాసేపు అక్కడి వాతావరణం రణరంగాన్ని తలపించింది. ఒకదశలో కొందరు బిఆర్ఎస్ నాయకులు

### ఇరువర్గాల మధ్య తోపులాటలు - పరిస్థితి ఉద్రిక్తం

కార్పొరేటర్ ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు గేట్లను మూసి వేశారు. బిఆర్ఎస్ శ్రేణులు తమపై దాడికి పాల్పడ్డారని, తమకు గాయాలయ్యాయని బిజెపి నాయకులు ఆరోపిస్తుండగా బిఆర్ఎస్ వారే తమపై దాడికి పాల్పడ్డారని, తమకు గాయాలయ్యాయని బిజెపి నాయకులు ఆరోపించారు.

**ఎమ్మెల్యేను దూషిస్తే సహించేది లేదు: బిఆర్ఎస్...** అనునిత్యం ఎల్‌బినగర్ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై బిజెపి నాయకులు నోటికి వచ్చినట్లుగా మాట్లాడితే సహించేదిలేదని బిఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. దుర్గాభవానినగర్‌లో ఎమ్మెల్యే శంకుస్థాపన గురించిన సమాచారాన్ని అధికారులు కార్పొరేటర్‌కు ఇచ్చినప్పటికీ రాకుండా మరుసటిరోజు తిరిగి శంకుస్థాపన చేయడానికి ప్రయత్నించడం అర్థరహితమన్నారు. తాము దీనిపై నిరసన వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై కార్పొరేటర్ వంగ మధు నోటికి వచ్చినట్లుగా అసభ్య పదజాలంతో దూషణలకు పాల్పడ్డాడని, ఇది ఇలాగే కొనసాగితే ఊరుకునేది లేదని వారు స్పష్టం చేశారు. డివిజన్‌లో కార్పొరేటర్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, అభివృద్ధి గురించి చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నాడు కాబట్టే ఎమ్మెల్యేపై కార్పొరేటర్ నోరు పారేసుకుంటున్నాడన్నారు. దీన్ని ఎట్టిపరిస్థితిలో సహించేది లేదని వారు పేర్కొన్నారు.

**దాడులకు ప్రతి దాడులు తప్పవు: బిజెపి** బిఆర్ఎస్ నాయకులు తమపై దాడులు చేస్తే భయపడేది లేదని నియోజకర్గానికి చెందిన బిజెపి కార్పొరేటర్లు వంగ మధుసూధన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహా గుప్తా, శ్రీవాణి, బిజెపి రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. బిఆర్ఎస్ నాయకులు తమపై దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవని వారు స్పష్టం చేశారు. దాడి జరుగవచ్చని పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినప్పటికీ వారు సరైన విధంగా స్పందించ లేదన్నారు. ఎమ్మెల్యే, పోలీసుల కనుసన్నల్లోనే కార్పొరేటర్ ఇంటిపై బిఆర్ఎస్ నాయకులు దాడి చేశారని వారు ఆరోపించారు. ఇంటి ముందుకు వచ్చి మహిళలు తలదించుకునే రీతిలో దుర్భాషలాడారని వారిని వదిలిపెట్టేది లేదన్నారు.

**ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దగ్ధం...** కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి ఇంటిని బిఆర్ఎస్ నాయకులు ముట్టడించడాన్ని నిరసిస్తూ నియోజకవర్గానికి చెందిన బిజెపినాయకులు కర్మన్‌ఘాట్‌చౌరస్తా వద్ద ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అయితే పోలీసులు వెంటనే వారిని అడ్డుకుని వారందరిని అదుపులోకి తీసుకుని వ్యాన్‌లోకి ఎక్కించారు.

## దివ్యాంగులకు కొత్త ఫించన్లు : ఎమ్మెల్యే బేతి


దివ్యాంగుల ఫించన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ శ్రీవాణి

**రామంతాపూర్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వం దివ్యాంగులకు తగు చేయూత అందిస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు రామంతాపూర్ మల్టీపర్పస్ పంక్షన్ హాల్‌లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి, డిసి శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి రమాదేవి, డిఇ చందన తదితరులతో కలిసి ఉప్పల్ నియోజకవర్గంలో దివ్యాంగులకు కొత్తగా మంజూరైన ఫించన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే, కార్పొరేటర్లు మాట్లాడుతూ గతంలో 3 వేలు ఉన్న ఫించన్ ఇకనుంచి రూ.4 వేలు చేసిందని, నేరుగా వారి ఆకౌంట్లలో డబ్బులు వేస్తారని తెలిపారు. ప్రజలకు అన్ని విధాలుగా చేయూతనందిస్తున్న ప్రభుత్వానికి సహకారమందించాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు వెంకటేశ్వరరెడ్డి, గరిక సుధాకర్, ఎం.డి.ముస్తాక్, జెసిబిరాజు, కుమారస్వామి, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, బిజెపి నేతలు కుమారస్వామి, తిరుపతయ్య, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థిగా శివారెడ్డి దరఖాస్తు


కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దరఖాస్తు చేసిన మేకల శివారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టిపిసిసి సభ్యుడు,మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి శుక్రవారం దరఖాస్తు చేశారు. ఉప్పల్ నుంచి భారీ ర్యాలీతో ఆయన పలువురు పార్టీ నేతలతో కలిసి ర్యాలీగా తరలి వెళ్లారు. అనంతరం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం దరఖాస్తు సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మేకల శివారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలనుంచి పూర్తి మద్దతు ఉందని పార్టీజెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఉప్పల్‌లో మాజీ చైర్మన్‌గా పనిచేశానని, ప్రజలకు మంచినీరు అందించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. తనకు టిక్కెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిపిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కంది ఆగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బజారు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సిద్ధంగా ఉండాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఎన్నికలు ఎప్పుడు వచ్చిన నాయకుల, కార్యకర్తలు సిద్దంగాఉండాలని అస్సాం రాష్ట్ర ఎమ్మెల్యే తెరాష్‌గోవల్ల, మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వారు పర్యటించిన తర్వాత ఎస్‌బిఐ కాలనీలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డివిజన్ కార్యవర్గ సమావేశంలో పాల్గొని వారు నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసారు. అదే విధంగా ఆశావర్కర్స్, అంగన్‌వాడి టీచర్లు, ఎస్‌హెచ్‌జి గ్రూప్ మహిళలలతో కలిసి భోజనం చేసారు. ప్రభుత్వ పథకాలు, కేంద్ర నిధులు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సందడి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, కొప్పుల దినేష్, నవీన్‌రెడ్డి, కొంగర ప్రవీణ్, వై.సురేందర్, జక్క మోహన్‌రెడ్డి, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బినగర్‌నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీకి మధుయాష్కి గౌడ్ దరఖాస్తు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసేందుకు మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మధుయాష్కి గౌడ్ శుక్రవారం దరఖాస్తు చేసుకున్నాడు. శ్రావణ శుక్రవారం కావడంతో ఆయన తన అనుచరులతో కలిసి ఎల్బీనగర్ నియోజకవర్గంనుంచి పోటీ చేసేందుకు దరఖాస్తును అందజేశాడు. ఇప్పటికే ఎల్బీనగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మల్‌రెడ్డి రామ్‌రెడ్డి కూడా దరఖాస్తు చేశాడు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎవరికి అవకాశం కల్పిస్తుందోనని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

## కాంట్రాక్టు టీచర్ల క్రమబద్దీకరణ హర్షణీయం

**సైదాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** సాంఘీక సంక్షేమ శాఖ పరిధిలోని గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను క్రమబద్ధీకరించానికి ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల టి.ఎస్.డబ్లు.ఆర్.ఇ.ఐ స్టాఫ్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. అసోసియేషన్ రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు(6వ జోన్ ఇంఛార్జి) జి.మధుకర్, రాష్ట్ర కోశాధికారి ఎస్. శశిధర్, ప్రధాన కార్యదర్శి వద్దెపల్లి ప్రభుదాస్, ఫౌండర్ ప్రెసిడెంట్ ఎ.వి.రంగారెడ్డి, చైర్మన్ ఎం.వెంకటేశ్వర్లు, మహిళావిభాగం కార్యదర్శి శ్రీలత, ప్రిన్సిపాల్స్ సంఘం సలహాదారులు తీగల అంజయ్య ప్రభుత్వ నిర్ణయంపట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 566 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయడానికి ప్రభుత్వామోదం లభించడంతో ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ కానున్నాయి. 16 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను క్రమబద్దీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని, సిఎం కెసిఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రిన్సిపల్‌సెక్రటరీ రాహుల్ బొజ్జా, కార్యదర్శి డాక్టర్ నికోలస్‌లకు సిబ్బంది సంఘం తరపున వారు ధన్యవాదాలు తెలిపారు.

## చేవెళ్లలో జరిగే కాంగ్రెస్ పార్టీ ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి : రామ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఈ నెల 26వ తేదీన ఛలో చేవెళ్ల కాంగ్రెస్ ప్రజాగర్జన విజయవంతం చేయాలని ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం చైతన్యపురి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేవెళ్లలోని కేవి గ్రౌండ్స్‌లో జరగబోయే ప్రజాగర్జన సభలో పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికఖార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, నియోజకవర్గంనుండి అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ ప్రజాగర్జనలో దళిత, గిరిజన డిక్లరేషన్ ను మల్లిఖార్జున ఖర్గే ప్రకటిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, బద్దుల వెంకటేష్ యాదవ్, దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి, మకుటం సదాశివుడు, బద్దుల వేణుగోపాల్‌యాదవ్, లింగాల కిషోర్‌గౌడ్, ఎర్రవెల్లి మంజులారెడ్డి, మల్లారపు శ్రీనివాస్, కుట్ల నర్సింహాయాదవ్, స్వర్ణమాధవి, జైపాల్‌రెడ్డి, భాను, శ్రీసౌమ్యరెడ్డి, సంగీత పాల్గొన్నారు.

## ప్రకృతితో మమేకమైన శ్రేయస్ విద్యార్థులు

**హయత్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు... పచ్చదనంతోనే ఆహ్లాదమనీ, ఆరోగ్యం అని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ దేవిడి గీతవేణుగోపాల్‌రెడ్డి అన్నారు. తట్టి అన్నారం లోని శ్రేయస్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు శుక్రవారం గ్రామపరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి హరితహారం కొనసాగించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఆఫీసర్ .రాగలతరెడ్డి, ఎన్ఎస్ఎస్ విద్యార్థి సమన్వయకర్తలు నిఖిల్, మాన్విత్, విద్యార్థి బృందం పాల్గొన్నారు.

## వరలక్ష్మి వత్రం ఎంతో పవిత్రం : శాంతిశేఖర్

**నాచారం, ఆగస్టు 25 ప్రభాతవార్త:** వరలక్ష్మి వ్రతం మహిళలకు ఎంతో పవిత్రమైనదని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. వరలక్ష్మి వ్రతాన్ని శ్రావణ శుక్రవారం సందర్భంగా కార్పొరేటర్ మహిళలతో కలిసి నిర్వహించి మహిళలకు వాయినాలు అందజేసి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సువర్ణ, సాహితితో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలి

**సైదాబాద్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** బిజెపి అధిష్టానం పిలుపు మేరకు హైద్రాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడికి మలక్‌పేట బిజెపి నాయకులు హరిగౌడ్ తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న వారందరికి డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని, ఎన్నికల సమయంలో వాగ్ధానం చేసిన పథకాలన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్‌కుమార్, బ్రహ్మానందం, విష్ణు, అనిల్, భాను తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కు గడ్డం సాయికిరణ్ రాజీనామా


రామంతాపూర్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న గడ్డం సాయికిరణ్

**ఉప్పల్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో సిఎం కెసిఆర్ బిసిలకు అన్యాయం చేస్తున్నారని బిసి సంఘం నేత, బిఆర్ఎస్ నాయకులు గడ్డం సాయికిరణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామంతాపూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బిసిలకు అసెంబ్లీ టిక్కెట్ కేటాయింపులో అన్యాయం జరిగిందని, ప్రజలను మోసంచేసే పార్టీగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గతంలో మంత్రి కేటిఆర్ తనకు పదవులు ఇస్తానని బహిరంగా చెప్పి మోసంచేశారని ఆరోపించారు. ఈనెల 27న అమిత్‌షా సమక్షంలో 10వేల మందితో బిజెపిలో చేరుతున్నానని తెలిపారు. నియోజకవర్గంలో వివిధ కుల సంఘాల మద్దతు తనకే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బొనగిరి శ్రీనివాస్‌గుప్త, గట్టు ప్రకాష్, రాగి వెంకట్‌రెడ్డి, పారుపల్లి హనుమంతరావు, సుదర్శన్‌రెడ్డి, ఆవుల సుధాకర్, అనిల్‌గౌడ్, పోటేల్ పరమేష్, వెంకటేష్, నాగుల శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్, పిసరి శంకర్, కె.శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, నాగరాజు, రంగనాద్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధికి పెద్దపీట : ఎమ్మెల్యే బేతి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే భేతి తదితరులు

**కుషాయిగూడ, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఉప్పల్ నియోజకవర్గంలో అన్ని కాలనీలలో సమగ్ర అభివృద్ధి చేసి అభివృద్ధికి పెద్దపీట వేశామని ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని వినాయక్ నగర్ ఫేస్2 లో నిర్మించిన మంచినీటి సరఫరా కార్యక్రమంతోపాటు శివసాయినగర్‌లో నిర్మించనున్న యుజిడి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో ఉప్పల్ నియోజకవర్గంలో అనుకున్న దానికంటే మరింతఅభివృద్ధి సాధించి చూపించామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు స్వర్ణరాజ్ శివమణి, జేరిపోతుల ప్రభుదాస్, నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గరిక సుధాకర్, కాప్రా డివిజన్ అధ్యక్షులు సుడుగు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిల్బర్ట్, కాసం మహిపాల్‌రెడ్డి, బేతాళ బాలరాజ్, కాటేపల్లి రవీందర్‌రెడ్డి, మహేష్, కొండల్‌గౌడ్, చంద్రారెడ్డి, గణేష్, శివకుమార్, పోచయ్యగౌడ్, భార్గవాచారి తదితరులు పాల్గొన్నారు.

## మత్సకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి


దీటి మల్లయ్యను సత్కరిస్తున్న బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** మత్సకారుల అభ్యున్నతికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మత్స సమాఖ్య వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దీటి మల్లయ్య ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హజరై ఘనంగా సత్కరించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మత్సకారుల సంక్షేమానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని, మత్సకారులను అన్ని విధాలుగా ఆదుకోవడంతోపాటు, వారికి చేయూత అందిస్తామని తెలిపారు. అనంతరం మల్లయ్య మాట్లాడుతూ మత్సకారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలు అందించేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మల్లయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు డా.బి.వి.చారి, మత్ససహకార సంఘం నేతలు కాపర్తి మోహనకృష్ణ, సతీష్, యాదగిరి, కిష్టయ్య, సత్యనారాయణ, సత్తయ్య, బాబురావు, గంగాధర్, వెంకటేష్, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి తండోపతండాలుగా మద్దతు


బంజారా తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న బండారు లక్ష్మారెడ్డి.

**కుషాయిగూడ, ఆగస్టు 25 ప్రభాతవార్త:** కార్యకర్తలను ప్రజలను కంటికి రెప్పల కాపాడుకుంటానని ఉప్పల్ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బిఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ మారుతి కాలనీలో బంజారా సోదరీ సోదరీమణులు జరిపిన తీజ్ ఉత్సవాల్లో ఆయనకు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు కష్టాలు ఉండకుండా చూసుకునే బాధ్యత తనదేనన్నారు. ప్రతిరోజు ఆయన కార్యాలయానికి వేలసంఖ్యలో ప్రజలు తరలివస్తూ మద్దతు పలుకుతున్నారు. ఈ కార్యక్రమంలో కొత్త రామారావు, మహేష్‌గౌడ్, బైరి నవీన్‌గౌడ్, జంపాల్‌రెడ్డి గుమ్మడి,ఇంద్రయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్లపై చెత్త వేసే వారిపై జరిమానా కొరడా

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌ను స్వచ్ఛ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేక్రమంలో రోడ్లపక్కన చెత్త వేస్తున్న వారిపై కార్పొరేషన్ కొరడా ఝులిపిస్తున్నది. కమీషనర్ వాణి ఆదేశాలమేరకు కార్పొరేషన్ పారిశుధ్య విభాగం పర్యవేక్షకులు రోడ్లపై తనిఖీలు చేసి రోడ్ల పక్కన చెత్త వేస్తున్న వారికి అపరాధ రుసుము విధిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ సమీపంలోని మంత్రాల చెరువు ఆర్‌సిఐ రోడ్డు పక్కన చెత్తవేస్తున్న మహ్మద్ అక్బర్ అనే వ్యక్తిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని రూ.2వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సూపర్‌వైజర్లు కొమ్మిని మహేందర్, నర్సింహులు మాట్లాడుతూ కమీషనర్ ఆదేశాల మేరకు రోడ్లపై చెత్త వేసేవారికి జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

## కుర్మల్‌గూడలో గద్దర్ సంస్మరణ సభ



గద్దర్ సంస్మరణలో పాల్గొన్న పారిజాత, చల్లా నర్సింహారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్ కుర్మల్‌గూడ గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన ప్రజా గాయకుల ఆధ్వర్యంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు గద్దర్ కుమార్తె వెన్నెల హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గద్దర్ లేని లోటు ఎన్నటికీ తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతనర్సింహారెడ్డి, రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నేతలు దేప భాస్కర్‌రెడ్డి, కొత్త మనోహర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పై చంపాపేట్ డివిజన్ బిజెపి కార్పొరేటర్ వంగా మధుసూదన్ రెడ్డి దుర్భాశలాడి అనుచిత వాఖ్యలు చేయడం సరైంది కాదని చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ ప్రజల, పార్టీ నాయకుల మనోభావాలు దెబ్బ తీసే విధంగా వ్యాఖ్యలు చేసిన వంగపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని శుక్రవారం చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో డివిజన్ బిఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు నర్సిరెడ్డి, కృష్ణ, శ్రీహరి, జాన్ కిరణ్, ప్రవీణ్ చారీ, జలంధర్, పులికిరణ్, నరేష్, సాయి, నవీన్, కళ్యాణ్, శివ, రాజు ఉన్నారు.

## మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నం

### బిజెపి నిరసనకారుల అరెస్టు.. ఘట్కేసర్ పిఎస్‌కు తరలింపు



అందెలను అరెస్టు చేస్తున్న మీర్‌పేట్ పోలీసులు పక్కన గాయపడ్డ అందెల

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోనున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి క్యాంపు కార్యాలయ ముట్టడికి బిజెపి చేసిన ప్రయత్నం ఉద్రిక్తతకు దారి తీసింది. పేదలకు డబుల్ బెడ్‌రూంఇళ్లు, నిరుద్యోగులకు భృతి తదితర ఎన్నికల హామీలను నెరవేర్చడంలో బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా కలెక్టరేట్లు, క్యాంపు కార్యాలయాలు ముట్టడించాలని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములుయాదవ్ పార్టీశ్రేణులతో కలిసి మంత్రి క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించారు. దీంతో మీర్‌పేట్ పోలీసులు వారి ప్రయత్నాలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌తో అందెలతోపాటు పలువురు నేతలు వాగ్వివాదానికి దిగారు. అయితే అరెస్టు చేసే ప్రయత్నంలో పోలీసులకు, నేతలకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో శ్రీరాములుతో పాటు పలువురి చొక్కాలు చిరిగిపోయాయి. పోలీసులు బలవంతంగా అందెలతో సహా పలువురు నేతలను అరెస్టుచేసి ఘట్కేసర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు బలవంతంగా అరెస్టు చేసే క్రమంలో అందెల స్వల్పంగా గాయపడ్డారు.

**పోలీసుల తీరుపై బిజెపి నేతల ఆగ్రహం...** మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడి సందర్భంగా పోలీసులు ప్రవర్తించిన తీరుపై మండి పడ్డారు. తమపై పోలీసులు దౌర్జన్యంచేసి చొక్కాలు చింపారని నిమ్మల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు ఆరోపించారు. ఏకంగా తమ నాయకునిపై దాడి చేసి ఘట్కేసర్‌కు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టయినవారిలో అందెలతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, పోరెడ్డి జగన్మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## అష్టలక్ష్మి దేవాలయంలో శ్రావణ శోభ

### అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


పూజలు నిర్వహిస్తున్న పండితులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** వాసవి కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో నిజ శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా తెల్లవారుజామునుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చి బారులు తీరడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ నెల 17వతేదీనుంచి సెప్టెంబర్ 14వ తేదీవరకు నిజ శ్రావణమాస మహోత్సవాలు దేవాలయంలో నిర్వహిస్తుండడంతో ఆలయ ప్రాంగణం శ్రావణ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ బంగారు వస్త్రాలతో భక్తులకు దర్శనమిచ్చారు. బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. దర్శనం కోసం వచ్చిన భక్తులకు దేవాలయ కమిటీ అన్నప్రసాదాన్ని కూడా అందజేశారు.

**సంతోషిమాత దేవాలయంలో...** దిల్‌సుక్‌నగర్ సంతోషిమాత దేవాలయంలో శ్రావణమాసం శుక్రవారంసందర్భంగా లక్షపుష్పార్చన, సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు. భక్తులు సంతోషిమాత ఉద్యాపన కార్యక్రమాలతో పాటు అమ్మవారికి వడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## ప్రజా సేవయే పోలీసుల కర్తవ్యం : ఏసిపి


హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎసిపి, ఇన్‌స్పెక్టర్ తదితరులు

**మలకపేట, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ప్రజలకు సేవ చేయడమే పోలీసుల కర్తవ్యమని ట్రాఫిక్ సౌత్ ఈస్ట్ ఎసిపి సత్యనారాయణ పేర్కొన్నారు. దిల్‌సుక్‌నగర్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డికి పర్స్ కనిపించడంతో వారి ఫోన్ నెంబర్ ఆధారంగా వారికి ఫోన్ చేసి మహిళను పిలిపించి పర్సును అందజేయడం జరిగిందని ఎసిపి వివరించారు. ఈ సందర్భంగా మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌రెడ్డిని ఎసిపి సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐలు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం ఎసిపి మాట్లాడుతూ పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.

## కెసిఆర్‌తోనే అంగన్‌వాడిల సంక్షేమం : బిక్షపమ్మ

**సరూర్‌నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** అంగన్‌వాడి టీచర్ల సంక్షేమం సిఎం కెసిఆర్‌తోనే సాధ్యమైందని రాష్ట్ర అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎం.బిక్షపమ్మ, రాష్ట్ర కన్వీనర్ ఎన్.నిర్మల, ప్రతినిధులు శ్రీలత, రాజేశ్వరి, విజయలక్ష్మి, శోభ, అనంతలక్ష్మిలు అన్నారు. అంగన్‌వాడి టీచర్లకు పదవీవిరమణ ప్రయోజనాలతోపాటు ప్రభుత్వ పథకాలకు అర్హులుగా చేరుస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపట్ల అదేవిధంగా మినీఅంగన్‌వాడి టీచర్లను మెయిన్ సెంటర్లకు మార్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్‌కు, మంత్రులు సత్యవతిరాథోడ్, హరీష్‌రావు, ఎమ్మెల్సీ కవితలకు కృతజ్ఞతలు తెలిపారు.

## దళిత గిరిజన మహాసభ పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న భాస్కర్ రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 25 ప్రభాతవార్త:** ఈ నెల 26వ తేదీన నిర్వహించే ఛలో చేవెళ్ల బహిరంగ సభలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే అధ్యక్షతన జరిగే దళిత గిరిజన మహాసభకు సంబంధించి శుక్రవారం ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నియోజకవర్గం పర్యవేక్షకులు సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు అది శ్రీనివాస్‌తో కలిసి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతు నిరుపేదలు, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, రాష్ట్ర బీసీ నాయకుడు గట్ల రవీంద్ర, నాయకులు బండి మధుసూదన్ రావు, నల్లెంకి దన్‌రాజ్‌గౌడ్, రమేష్ నేత, అక్బర్, పగడల శ్రీశైలం, కల్యాణ్‌యాదవ్, ఇమ్రాన్, ప్రేమ్‌నాయక్, రాజ్‌నాయక్, నగేష్ నేత, భాస్కర్ నాయక్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.